

కె. బాలగోపాల్

# ఐక్యరాజ్యసమితిని కాపాడడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?

ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ కోఫీ అన్నన్‌ను చూస్తే ఈ మధ్య జాలి కలుగుతున్నది. ప్రపంచ దేశాలు అంతర్రాష్ట్ర సమస్యల శాంతియుత పరిష్కారం కోసం ఏర్పాటుచేసుకున్న సంస్థకు ఆయన సెక్రెటరీ జనరల్. కానీ ఒక బలమైన దేశం ఒక బలహీనమైన దేశంపైన పాశవికంగా దాడికి పాల్పడుతుంటే ఆయన ఏమీ చేయలేక, మన దగ్గర ప్రభుత్వం తప్పుడు పనులు చేస్తే పెద్దమనుషులు నిస్సహాయంగా మీటింగ్‌లు పెట్టుకొని 'ఇలా చేయకపోతే బాగుండేది' అంటూ పెదవి చప్పరించినట్టు 'ఇరాక్ సమస్య వేరే రకంగా పరిష్కారం అయి ఉంటే బాగుండేది' అని బాధపడడం తప్ప కోఫీ అన్నన్ ఏమీ చేయలేకపోతు న్నాడు.

ఇరాక్ దగ్గర అత్యంత ప్రమాదకరమైన మారణాయుధాలు ఉన్నాయని అమెరికా అభియోగం. అమెరికా దగ్గర అంతకంటే ప్రమాదకరమైనవి ఉన్నాయి. అందరి దగ్గరున్న ప్రమాదకరమైన మారణాయుధాలూ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో తొలగించి వేస్తే బాగుండేది. కానీ జరుగుతున్నది అదికాదు. ఎన్ని ప్రమాదకరమైన ఆయుధాలున్నప్పటికీ అమెరికా, రష్యావంటి దేశాలు 'బాధ్యతాయుతంగా' వ్యవహరిస్తాయనీ, 'బాధ్యత' తెలియని ఇరాక్ వంటి దేశాల చేతులలో ప్రమాదకరమైన ఆయుధాలు ఉండకుండా చూడడం మాత్రం అవసరమనీ పాశ్చాత్య దేశాల వాదన.

ఇది తెల్లజాతి దురహంకారం తప్ప వేరే ఏమీ కాదు. కానీ ఈ జాత్యహంకారం ఐక్యరాజ్యసమితికి కొత్తకాదు. ఐక్యరాజ్య సమితిలో అన్ని దేశాలూ సమాన హోదా కలిగిలేవనేది తెలిసిన విషయమే. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న కొన్ని దేశా లున్నాయి. వాటికి ఐక్యరాజ్య సమితి నిర్ణయాల విషయంలో 'వీటో' అధికారం ఉంది. దీని గురించి ఐక్యరాజ్యసమితి ఏర్పడిన నాటి నుండి బడుగుదేశాలు గొడవ చేస్తూనే ఉన్నాయి. అన్ని దేశాలకూ సమాన ప్రతిపత్తి ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ అమెరికా రష్యా వంటి అగ్రరాజ్యాలు ఒప్పుకోవడం లేదు. చిన్నాపెద్దా తేడా లేకుండా అన్ని దేశాలకూ ఒకే ప్రతిపత్తి ఇచ్చేస్తే 'బాధ్యత తెలియని' చిన్నాచితక దేశాలు ప్రపంచ వ్యవహారాలను నిర్ణయించి పారేసే ప్రమాదం ఉందన్న వాదనతో వాళ్లు తమ ప్రత్యేక ప్రతిపత్తిని సమర్థించుకుంటున్నారు.

ఇప్పటికే జనరల్ అసెంబ్లీలో పెద్ద సంఖ్యలో ఉన్న ఆఫ్రికా, ఆసియా దేశాలు తరచుగా 'బాధ్యతగల' పెద్ద దేశాల మాట వినకుండా అనేక విషయాలలో ఏకగ్రీవ తీర్మానాలు చేస్తుండడం పట్ల అమెరికాకు చాలా కోపంగా ఉంది. ఆ తీర్మానాలకు అవి రాసిన కాగితం విలువకంటే ఎక్కువ లేదు కాబట్టి సరిపోయింది గానీ లేకపోతే ఈ పాటికి ప్రపంచ భద్రత ఏమైపోయేదని అమెరికా తరచుగా గొణుక్కుంటూ ఉంది.

అమెరికా, సోవియట్ రష్యాల ప్రచ్ఛన్న పోరు నడిచిన రోజులలో ఐక్యరాజ్య సమితి ఆ రెండు రాజ్యాల కొట్లాటలకు వేదికగా ఉండింది. ప్రపంచంలో ఎక్కడ ఏ ఘర్షణ జరిగినా అమెరికా ఒక పక్షం, సోవియట్ రష్యా ఒక పక్షం తీసుకొని వీటోలు ప్రయోగించి ఐక్యరాజ్య సమితి ఏమీ చేయలేకుండా చేశారు. కాశ్మీర్ ఒక చక్కటి ఉదాహరణ. కాశ్మీర్ ప్రస్తావన ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ ఎప్పుడు తీసుకొచ్చినా భారతదేశం తరఫున రష్యా వీటో ప్రయోగించేది. దానితో, చేసిన తీర్మానాలను పునరుద్ఘాటించడం తప్ప కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోయింది.

సోవియట్ కూటమి పతనమై ప్రచ్ఛన్న యుద్ధం ముగియడంతో ఐక్యరాజ్య సమితికి ఈ పీడ నుండి విముక్తి లభించిందని నమ్మిన వారికి త్వరలోనే ఆశాభంగం అయింది. రెండు అగ్రరాజ్యాల పోరుకు వేదికగా ఉండిన ఐక్యరాజ్యసమితి త్వరలోనే ఒక అగ్రరాజ్యానికి సాధనంగా మారి, ప్రస్తుతం ఆ అగ్రరాజ్యం సహితం పట్టించుకోని ఒక అక్కరలేని వేదికగా మారింది. ఈ పరిణామాలకు కేంద్ర విషయం ఇరాక్ నియంత సద్దాం హుసేన్‌కు 'బుద్ధిచెప్పాలని' అమెరికా చేస్తున్న ప్రయత్నం. సద్దాం మంచివాడని ఎవరూ అనలేరు. కానీ అతని లాంటి నియంతలు ప్రపంచం నలుమూలలా ఉన్నారు. వారిలో అమెరికా ప్రయోజనాలకు అడ్డం తగిలిన వారికి మాత్రమే చెడ్డపేరు వస్తుంది.

ఇరాక్ ప్రజలను హింసించడం ద్వారా సద్దాం హుసేన్ అధికారాన్ని నీరసింపజేయాలనే క్రూరమైన ఆలోచనను అమెరికా అమలు చేయదలచుకుంది. దీనికి ఐక్యరాజ్య సమితిని సాధనంగా వాడుకుంది. ప్రపంచ దేశాల మధ్య సమస్యలు యుద్ధం దాకా పోకుండా శాంతియుతంగా పరిష్కారం కావడం కోసం కృషి చేసే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటయిన ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోనే అమెరికా కొన్నేళ్ల కింద ఇరాక్‌పైన యుద్ధానికి దిగింది. ఇంతకంటే వికృతమైన చర్య వేరే ఏదీ ఉండదు. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావానికి సంబంధించిన చరిత్రను పూర్తిగా మరచిపోయిన బిల్ క్లింటన్ వంటి థర్డ్‌రేట్ రాజకీయ నాయకులకు అది వికృతంగా తోచకపోవచ్చుగాక.

యుద్ధం చేయడమేకాక ఇరాక్ ప్రజలను తీవ్రమైన బాధలకు లోను చేసే ఆంక్షలు సహితం ప్రయోగించారు. ఇరాక్‌కు ప్రధాన ఆధారమైన పెట్రోలియం ఎగుమతులు సహితం నిలుపు చేయగలిగారు. అత్యవసరమైన మందులు దొరకక కనీసం 5000 మంది పిల్లలు ఇరాక్‌లో ఈ ఆంక్షల ఫలితంగా చనిపోయారని అంచనా. వేరే సందర్భంలో ఒక అగ్రరాజ్యం ఒక బడుగు దేశాన్ని ఈ రకంగా హింసిస్తే దానిని ఆపడానికి జోక్యం చేసుకోవలసిన ఐక్యరాజ్య సమితి ఈ ఘోరంలో భాగం కావడం ఈ మొత్తం ప్రహసనంలో అత్యంత బాధాకరమైన విషయం.

1998 వచ్చేసరికి ఐక్యరాజ్య సమితిని ఈ విధంగా వాడుకునే ప్రయత్నం కూడా అనవసరమని బిల్‌క్లింటన్ భావించాడు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఒక పక్క సమావేశం అయి ఉండగానే, భద్రతా మండలికి ఒక్క మాట కూడా చెప్పకుండా ఇరాక్‌పైన దాడి చేశాడు. ఇంగ్లాండ్ (మరొక శాశ్వత సభ్యదేశం) క్లింటన్‌తో కలిసిపోయింది. చిన్నా చితక దేశాల 'బాధ్యతారాహిత్యం' గురించి తరచు వాపోయే ఈ పెద్ద దేశాలు ఇంతకంటే బాధ్యతా రహితంగా ఎవరు ప్రవర్తించగలరో చూడండన్నట్టు ప్రపంచానికి సవాలు విసిరాయి. కోఫీ అన్నన్ 'తప్పు తప్పు' అంటూ విలేకరులతో వాపోవడం తప్ప ఏమీ చేయలేకుండ ఉన్నాడు.

అయినప్పటికీ ఐక్యరాజ్య సమితి తొలినాటి లక్ష్యాన్ని కాపాడుకోవడం అవసరం. లేకపోతే దేశాల మధ్య సమస్యలకు, యుద్ధం తప్ప వేరే పరిష్కారం లేదన్న ఆటవిక నీతిని ఆమోదించడం అవుతుంది. కానీ ఈనాటి 'గ్లోబలైజేషన్' నేపథ్యంలో అమెరి కాను కాదని ఈ పని చేయడానికి ఏ దేశం సిద్ధంగా ఉంది? ●